# 3. జ్ఞానోదయం

ముందు కాస్త అనుమానించి, కొద్ది ఆలోచనమీద నిర్ధారణ చేసుకొని ఆ చీకట్లోనే మెల్లిగావెళ్ళి, ఆమెకు పక్కగావున్న కుర్చీని ఆక్రమించుకున్నాడు - సుబ్బారావు. ఆ గుడ్డివెలుగులోనే ఆమెను పరీక్షించి చూసేందుకు ప్రయత్నించాడు...అందమైన, పాతికేళ్ళ యువతి పక్కనే ఉండగా అతనికి కొత్తరకం ఆనందంతో సినిమా చూడటానికి ఇదే మొదటిసారి. ఒక పావుగంట గడచేప్పటికి, ఆమెకు సమీపంలో ఆమె సమ్మంధీకులైన మగపురుగే లేనట్టు తేలిపోయింది. ఇకమిగిలిన కొద్దిమందికీ - తను ఏం చేస్తోందీ పట్టదాయె!

ఏలాగైనా ఆమెతో పరిచయం చేసుకోవాలని కూడా అతనికి కుతూహలంగానే వుంది. కాని ఇలాటి వ్యవహారాల్ని మొదలుపెట్టడం ఎట్లాగో అతనికి తెలియటం లేదు ... మరి పొరబాటో కాదోకాని-ఆమెచెయ్యి తనచేతిని తాకటాన్ని అతను గుర్తించాడు. కాని పొరపాటైతే ఆమె చెయ్యి వెనక్కు పోదేం? ఇక సందేహం లేదు - తనలాగే ఆమె కూడా యీ 'ప్రేమ'కు బలయింది!

ఆమె ఎందుకో కాని కొంచెం పెద్దగా నవ్వింది తెర వైపు చూడకుండానే అతనుకూడా ఆమెతో శృతి కలిపాడు. ఆమె "చాలా బాగుంది-" అంది ఇంగ్లీషులో.

"అవును" అన్నాడు, అతనూ ఆ భాషలోనే!

తన నాయకికి ఇంగ్లీషు రావడం ఎంత అదృష్టం! ఆంగ్లో ఇండియన్ యువతులకు ఇంగ్లీషు వచ్చినా వాళ్ళెప్పుడూ అతన్ని ఆకర్షించలేదు. కాని హిందూసుందరి కంఠంలో ఆ భాషకు మోక్షంవచ్చి, సంగీతంకూడా అబ్బింది. అందులోనూ ఇంగ్లీషులో 'రొమాన్సు' నడపాలని అతను చాలా కాలంనుంచీ ఎదురుచూస్తున్నాడు.

మళ్ళీ ఆమె కాలు - అతని కాలికోసం దేవులాడింది....అతనిలో భయమంతా తీరిపోయి - విద్యుత్ ప్రవాహం అన్ని నరాల్లోనూ వడివడిగా పనిచేసింది. స్త్రీ కోమల స్పర్శలో ఎంత ఆనందంవుంది! ఒకటి రెండు నిమిషాలు గడిచాక, ఆమె అతని ముఖంలో ముఖముంచి నవ్వింది...సుబ్బారావు తనను తానే మరిచిపొయ్యాడు. తప్పకుండా ఇది మొదటిచూపుల్లో ఏర్పడే ప్రేమే! కాని, తన కథల్లో వచ్చే రొమాన్సుకన్న అనేకరెట్ల వేగంతో ఇది పెరిగిపోయింది... మొత్తానికి రొమాన్సు కథల్లోకన్న కూడా చౌకేనన్నమాట!...ఇక ముందు జరగాల్సిన కథ కోసం అతను తన కథల్నీ, ఇతర కథల్నీ జ్ఞాపకం చేసుకుంటూ మాటలకోసం వెతుక్కో సాగాడు.

"మీ కథలు చాలాబాగుంటై..." అంది, ఆమె.

అదా-? అసలు తన కథల్నీ, పేరునూ పట్టే యీ ప్రేమ లోగడెప్పుడో పుట్టి, పెరిగి నేటికి - యీ యర్ధరాత్రికి ఈ అవతారాన్ని ఎత్తిందన్న మాట! లోకంలోని ప్రేమకూ, యీ ప్రేమకూ ఎక్కడి పోలిక! తన కథలు బాగున్నయ్యనే మాట ఒక అపరిచిత సుందరి కంఠంనుంచి వినగానే - అతనికి వెయ్యిమంది ఒక్కసారిగా పొగిడినట్టనిపించింది! తనకు, తన ఊహ పోనంత కీర్తివుందన్న మాట! ప్రియురాలు లేకుండానే తను రాసిపారేసిన కథలూ, గీకిన భావకవిత్వమూ, తూకం లెక్కనైనా లోకంలో - విశేషించి సౌందర్యవతుల హృదయాల్లో ఉన్నతస్థానాన్ని సంపాయించు కున్నాయన్నమాట. గురూజీ రికమన్‌డేషన్లతో కూడా తన కథలు పత్రికల్లో పడకపోవటంవల్ల తను పడ్డబాధా, గురూజీ అందుకు అగ్గయి పోవడమూ, తన పద్యాలు సంక్రాంతి సంచికలో పడకపోవటం వల్ల తను ఆనాడు ఉపవాసం చేసి, ఆ వ్యక్తి సత్యాగ్రహం మాటను సంపాదకులకు రాయటమూ అన్నీ తనకి యీ క్షణంలో మిథ్యలుగా తోచినై. ఎన్ని కథలు రాసి మిగతా కథకులు ఇలాటి సౌందర్యవతిని సంపాయించ గలిగారు?

"దానికేంలెండి" అన్నాడు, అంత పొగడ్తను తను జీర్ణించుకోలేనట్టు.

"మీ కథలు నన్ను వింతలోకాల్లోకి లాగుతై."

తన భావకవిత్వమూ, అతి వాస్తవికలూ, దేశం తిడుతూన్నా తను నింపిన రీముల కాగితాలూ - ఎంత ఉపయోగ పడ్డయ్! తన భావకవిత్వపు సుందరే ఇక్కడ రక్త మాంసాలతో ప్రసన్నమైనట్టుంది!

సమాధానంగా - సన్నగా నాజూగ్గా నవ్వాడు.

"మీతో ఒక రోజు మాట్లాడాలని వుంది-"

"ఓ...దానికేం?" సుబ్బారావుకు, తన్నుకు గారెల బుట్టలో పడ్డటయింది 'హావిధీ! నీలీల లమోఘములుగదా!' అనుకున్నాడు స్వగతంలో.

"శ్రమ కాకుంటే - మా ఇంటి కొకసారి వస్తారా?"

"శ్రమేముందిలెండి...మీ ఇల్లెక్కడ?" తనింటికే వస్తానని ఇబ్బంది పెట్టలేదు -నయమే!

"సినిమా అయ్యాక వెళ్దాం...తెల్లారగానే మిమ్మల్ని మళ్ళీ పంపేస్తాను."

ఏమౌతుందోనని తొందరపడుతూన్న అతని హృదయానికి యీ మాటలు అమృతధారగా తోచినై. స్నేహితుల కోసం తను గంటనైనా వృథాచెయ్యకుండా - తను పని చెయ్యలేని సాహిత్యశాఖ లోకంలో లేదని నిరూపించిన అతని అఖండ భుజబలం అక్కరకు వచ్చినప్పుడు - ఇకముందంతా తీరికేనాయె!

"ఓ....అల్లాగే" అన్నాడు.

సినిమా ఎప్పుడైపోతుందా అన్న ఆతృత అతనికి అధికమైంది. ఏ గొప్పింటి బిడ్డో, ఏ కాలేజీ విద్యార్థినో, బేవార్సుగా వచ్చిన యీ కుర్చీ పక్కనే తనకు క్షణంలో స్నేహితురాలవటం - నిజంగా తన జాతకంలో ఇది ఉచ్ఛదశే! ఇక ముందు జరగబొయ్యే అనుభవాలు తనకు కొత్తవటంవల్ల, రేపు సూర్యోదయం దగ్గర్నుంచీ రాసే కవిత్వంలోని నాయకికి మరినాలుగు మెట్లు ఇంక్రీమెంటు తప్పదు.!

"వెధవసినిమా బాగా లేదు" అన్నాడు, ఎల్లాగైనా ఆమె మనసు తిప్పాలని.

"ఛా-ఏమీ బాగాలేదు."

తన రుచులే ఆమె రుచులు...ఎంత లయ!

ఆమెను వెంటనే బయలుదేర మనేందుకు అతనికి దమ్ము ల్లేవు.

"పోనీ వెళ్ళిపోదామా?" అంది ఆమె!

అన్నాడు: "ఇక్కడ కూర్చుంటే తలకాయ నొప్పికూడా వచ్చేట్టుంది" ఒక సినిమా వ్యాసం బలికావటాన్ని కూడా లెక్క చెయ్యకుండా.

"మా ఇంటికి వెళ్దాం-"

అమితోత్సాహంతో ఆమెతో పాటే జట్కా ఎక్కాడు. ఆమెను తాకుతూ కూర్చొని జట్కా ఊపులకు కలిగే ఆనందాన్ని కవిత్వానికి జోడించి ఒక గేయాన్ని అల్లసాగాడు. ఆమెకూడా తనను ప్రోత్సాహిస్తున్నట్టే తోచింది - లేకపోతే ఇలాటివి ఇంకోరకం స్నేహానికి దారి తియ్యలేవని తను మనస్తత్వ పరిశీలనతో ఏనాడో నిర్ణయించుకున్నాడు; మనస్సులు కలవటంలో ఎంత హాయివుంది!

ఒక మేడముందు జట్కా ఆగింది. ఆమె ఎంత వారించినా వినకుండా, జట్కా బాడుగను అతనే ఇచ్చాడు. ఆ జట్కా లైటుకాంతిలో తను పర్స్ విప్పి ఆమెకు

కన్పించేటట్టుగా. ఎత్తిన కరెన్సీనోట్ల బొత్తరనుపట్టి - తనూ ఆమెతో తూగగల ఐశ్వర్యవంతుడేనని గ్రహించివుండాలి!

ఆమె తలుపు తట్టింది. ఒక యువకుడు తలుపు తెరిచాడు. ఆమె వెనకాలే నడవసాగాడు. స్త్రీ స్వాతంత్ర్యాన్ని గుర్తించిన - ఒక గొప్ప ఇంటిపడుచుతో తనకు స్నేహం కలగటం - ఇది తన భావిజీవితంలో తీసుకురాగల స్వర్గసౌఖ్యాలన్నీ అతని బుర్రలో వడివడిగా పనిచెయ్యసాగినై... ఇన్నాళ్ళూ దేశమంతటా ప్రచురణకర్తలకోసం దేవులాడిన తను - ఇక ముందు యీామె డబ్బుతో, కావాలంటే ఆమెకే అంకితంచేసి, తన సినిమా వ్యాసాల దగ్గర్నుంచీ వరసగ్గా సంపుటాలు సంపుటాలుగా ప్రచురించే రోజొకటి ముందు తప్పకుండా దొరుకుతుంది. వీలైతే ఒక ఫిలిం కంపెనీ కూడా స్థాపించి, ఇదివరకే తను రాసిపెట్టిన సినేరియోను తెర కెక్కించి... ఆ ఛాన్స్‌కోసం తను ముందుగా కొద్దిడబ్బును ఖర్చు పెట్టాల్సివున్నా - అది వ్యాపారానికి పెట్టుబడిలాటి దవుతుంది కనుక - వెనుకంజ వేయనక్కర్లేదు!

ఆమె సరాసరి పడకగదిలోకి దారితీసి, లైటువేసి - మంచం మీద కూర్చొని తనపక్కనే అతనికి స్థలంచూపింది... ఆమె తను తలిచినట్టుగాలేక, ఏ వేశ్యయినా ఐతే?....కాని ప్రేమ సిద్ధాంతాన్ని ఇక్కడ అప్లయ్‌చేస్తే మాత్రం మనస్తత్వ పరిశీలనతో ప్రేమకున్న ప్రగతి ఇక్కడ కన్పిస్తోంది.

అతను కూర్చొని, మెల్లిగా ఆమె భుజంమీద చెయ్యివేశాడు. ఇంతవరకూ కొద్ది మోతాదుల్లో పనిచేస్తూన్న భయమంతా మాయమైంది. ఇంత మంచిపిల్లను - కానీ కాగితాలమీదరాసే కవిత్వంతో సంపాయించ గలిగాననే ధీమాకూడా చెలరేగింది - ఒకటిరెండు నిమిషాలు గడిచేప్పటికి అతని జేబులో పర్స్ బరువుతగ్గింది. సుబ్బారావు అదిరిపడ్డాడు! ఆ పర్స్‌లో తండ్రి ఇంటిఖర్చుకుగాను పంపిన వంద రూపాయిలున్నయ్... అదీకాక తను అనుకున్నట్టు యీామె సద్వంశ కాకపోగా, వేశ్యకూడానా యేమిటి?

"ఏమిటీ?" అన్నాడు తడబడుతూ.

ఆమెనవ్వు మాయమైంది. లేచినిలబడ్డది. సుబ్బారావు ప్రేమనిషా తగ్గిపోయింది. ఏమిటీ దౌర్జన్యం? తన ఇల్లే కదానని ఎల్లా ప్రవర్తించినా ఫర్వాలేదనుకుంటోందా? ఆమె సౌఖ్యంకన్న - ఆ డబ్బుకే ఎక్కువ విలువవుంది. అందులోనూ మొట్టమొదటిపద్దే ఇంతదూరం, వెళ్ళటాన్ని అతను భరించలేక పొయ్యాడు. వెంటనే అతనిలో కోపమూ, రోషమూ, అసహ్యతా ప్రవేశించినయ్.

"మాట్లాడవేం?" అన్నాడు కళ్ళెర్రజేసి.

ఆమె నిర్లక్ష్యంగా నవ్వి, ఎగతాళిగా కళ్ళెగరేసింది.

"అదిటివ్వు-" అన్నాడు అధికార స్వరంతో.

"తమరింక దయచెయ్యండి."

అతని కిది భరించరానిదైంది. పాతికేళ్ళ నుంచీ పరిస్థితు లెక్కడా అనుకూలించకపోవటంవల్ల తప్పనిసరిగా కూడబెట్టుకొని, గర్వపడుతూన్న తన బ్రహ్మచర్యబలాన్ని అతను పూర్తిగా విశ్వసించాడు. అతనికోపం భయాన్ని పాతాళానికి అణగదొక్కింది... ఇక లాభంలేదు. ఆమెతో కలియబడ్డాడు. భీమకీచకుల్లాగు రెండుమూడు నిమిషాలు పోట్లాడేటప్పటికి కవి అలసిపొయ్యాడు. ఇక గత్యంతరంలేక ఆమె జడను పట్టుకొని - లొంగతియ్యాలని...

కాని ఆ వెంట్రుకలు ఆమెకు ఏ విధమైన బాధనూ కలగ చెయ్యకుండానే - జడ జడగానే అతని చేతుల్లోకి ఊడివచ్చింది. విగ్గుపోగా మిగతా బృహన్నల ఆకారం ముందుంది...అతను కొయ్యబొమ్మలాగు నిలబడిపొయ్యాడు.

ఆమె - కాదు అతనే సుబ్బారావు చెయ్యిపట్టుకొని, "యిక పదండి... బి.ఏ.లు పాసై కూటికిమాడి రోజూ యీ ఆడవేషాలు వెయ్యలేక ఛస్తూంటే నీ ప్రేమసాహిత్యం నాకు దేనికీ కవిగారూ!-" అని నవ్వసాగాడు.

ఆ కంఠంలో మృదుత్వంలేదు. ఆ స్పర్శలో సౌకుమార్యత లేకపోగా, యినపముద్ద చేతిమీద పడ్డట్టయింది. సుబ్బారావు అవమానంతో నేలచూపులు చూస్తున్నాడు.

తన ప్రియురాలి హస్తం (ప్రియుడి?) మెడమీదపడి ద్వారందాకా నెట్టుకుపోయి - బజారులోకి నెట్టేదాకా అతనికి తెలిసిరాలేదు. రోడ్డుమీదపడి మెల్లగాలేచి మన్ను దులుపుకుంటూండగా, ఆ చీకట్లో ఏమీ కన్పించకపోయినా తన వెనుక మాత్రం తలుపు దభీమని శబ్దమైంది!

మర్నాడు సాయంత్రం అదే థియేటర్ దగ్గర రెండు ఆడవేషాలు సంపాదనకోసం తారట్లాడ సాగినయ్!

*- ఏప్రిల్, 1941*